అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

సంపుటి: 20 | సంచిక: 341 | వరంగల్ | శనివారం, 24 అక్టోబర్ 2026 | పేజీలు: 08

పోలీస్‌స్టేషన్ అంటే బాధితులకు సత్వర న్యాయం లభించకపోయినా కొంత ఊరట లభించే ప్రదేశం. అన్యాయం జరిగిన వారు తమ గోడు వెళ్లబోసుకునే వేదిక. నేరగాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుని, బాధితులకు రక్షణ కల్పించే బాధ్యత ఇక్కడ ఉండే పోలీసులది. అయితే అలాంటి ప్రాధాన్యం ఉన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలంటే డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందనే ఆరోపణలు వస్తున్నాయి. పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, కేసుల వివరాల నమోదు, అధికారిక ఉత్తరప్రత్యుత్తరాలు, సిబ్బంది విధుల సమన్వయం వంటి కీలక బాధ్యతలు నిర్వర్తించే రైటర్ల పై వస్తున్న ఆరోపణలు అందుకు కారణమవుతున్నాయి. విధి నిర్వహణలో కీలకంగా ఉండాల్సిన కొందరు రైటర్లు, సిబ్బంది తమ స్థానాన్ని అడ్డం పెట్టుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌ఓ) ఎంత మంది మారినా రైటర్లు మాత్రం తమ పట్టు కోల్పోకుండా అక్కడే ఎళ్ల తరబడి నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వర్తిస్తూ వసూళ్ల దందా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు పోలీసు వర్గాల్లో చర్చకు దారితీస్తున్నాయి.

- అక్షరశక్తి, హన్మకొండ క్రైమ్

రైటర్లదే హవా!

పోలీస్‌స్టేషన్లలో భారీగా వసూళ్ల వ్యవస్థ?



బెయిల్ నుంచి కేసుల నమోదు వరకు చేతులు తడపాల్సిందే ?

లాంగ్‌స్టాండింగ్‌తో పాతుకుపోయి పట్టు

ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో రైటర్ల వ్యవస్థపై ఆరోపణలు

3

నేనెప్పుడూ నక్సలైట్ అవుతానని అనుకోలేదు

నాకు ఎలాంటి రాజకీయ బ్యాక్ గ్రౌండ్ లేదు

కానీ కష్టాన్ని నమ్ముకొని పనిచేశాను: మంత్రి సీతక్క

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని తెలంగాణ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. స్త్రీల రాజకీయ ఎదుగుదలలో ఎన్నో సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఆయా సమస్యలకు భయపడకుండా వాటిని అధిగమించి వనితలు ఉన్నత స్థానాల్లోకి చేరుకోవాలని ఆకాంక్షించారు. శనివారం నాడు హైదరాబాద్ మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో.. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు.. మహిళా రాజకీయ నాయకత్వం సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ గురుదీప్ సింగ్ సత్వాల్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కోటా నీలిమ, పెద్దఎత్తున మహిళా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. *- అక్షరశక్తి, హైదరాబాద్*



4

ఈ నెల 27 నుంచి బాలుర క్రీడా పోటీలు



అక్షరశక్తి, హనుమకొండ: సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 27వ తేదీ నుంచి అంతర్ కళాశాల బాలుర క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుంకరి జ్యోతి తెలిపారు. ఈ పోటీల్లో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ డిగ్రీ కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారని ఆమె పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ తమ కళాశాలల నుంచి జారీ చేసిన గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, నిర్ణీత క్రీడా నిబంధనలను పాటిస్తూ పోటీల్లో పాల్గొనాలని ప్రిన్సిపాల్ సూచించారు. క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పోటీల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆమె వెల్లడించారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభ సమావేశం నిర్వహించనున్నట్లు ఆచార్య జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, ఓఎస్‌డీ ఆచార్య వెంకటరామిరెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయం క్రీడా విభాగం సంచాలకులు డాక్టర్ చారి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ హాజరుకానున్నారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్లే ఈ పరిస్థితి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు




అక్షరశక్తి, వరంగల్: కరువు ప్రభావంతో ఎండిపోయిన ఎస్సారెస్పీ ప్రధాన నీటి కాలువలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం పరిశీలించింది. వరంగల్ పరిధిలోని ఆరేపల్లి వద్ద కాలువల్లో నీళ్లు లేకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్లే కాలువల్లో నీరు లేకుండా పోయిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. కనీసం బతుకమ్మ పండుగ సమయంలోనూ నీటిని అందించకపోవడం తెలంగాణ సంప్రదాయ పండుగలను దెబ్బతీయడమేనని ఆరోపించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిని వారు 'కాంగ్రెస్ తెచ్చిన కరువు'గా అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగునీటి విషయంలో చేతులెత్తేశారని విమర్శించారు. ఈ పర్యటనలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో పాటు ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాక్షి ఫెస్టివల్ లో ఐశ్వర్య చిత్రాలు

అబ్బుర పరిచిన ప్రతిభ




అక్షరశక్తి, హనుమకొండ: బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో నిర్వహిస్తున్న కళాక్షి ఫెస్టివల్ ఎడిషన్ టు లో భాగంగా వివిధ కళాకృతులు ఏర్పాటు చేయగా నామాని ఐశ్వర్య అద్భుతమైనటువంటి కళాకృతులను ఆవిష్కరించింది. శనివారం ఉదయం 11 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో వివిధ రకాల బొమ్మలను గీసి ప్రదర్శనలో ఉంచింది. అంతేకాక కళాకృతులను ఆకట్టుకున్న ఆహుతులు కొంతమంది వీటిని కొనుగోలు కూడా చేయటం జరిగింది.ఈ సందర్భంగా ఆర్టిస్ట్ నామాని ఐశ్వర్య మాట్లాడుతూ చిన్ననాటి నుండి బొమ్మల గీయడం చాలా ఆసక్తిగా ఉండేదని తమ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ స్థాయికి వచ్చానని తెలియజేసింది.ఈ కార్యక్రమం కాలోజీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కళాక్షి ఫౌండేషన్ వారికి రాష్ట్ర ప్రభుత్వానికి ఐశ్వర్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు .ఈ కార్యక్రమంలో ఆర్టిస్ట్ ఐశ్వర్యతో పాటు తల్లిదండ్రులు సాంబయ్య రమాదేవి పాల్గొన్నారు.

టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్షను వాయిదా వేయాలి

సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు లేఖ



అక్షరశక్తి, హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శనివారం నాడు బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ ఇంజినీరింగ్ విద్యార్థుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయొద్దని సూచించారు. నవంబర్ 6వ తేదీన జరగనున్న టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్షను వెంటనే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. SSC JE, టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్షలు ఒకే తేదీలో ఉండటంతో వేలాది మంది తెలంగాణ ఇంజినీరింగ్ అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో SSC JE పరీక్ష రాసే అభ్యర్థులు వెంటనే తెలంగాణకు తిరిగివచ్చి ఏఈఈ పరీక్ష రాయడం ఎలా సాధ్యం? అని ప్రశ్నించారు.

ఆ రెండు పరీక్షలు రాసే అవకాశం కల్పించాలి

ఏళ్ల తరబడి కష్టపడి సిద్ధమైన రెండు పోటీ పరీక్షల్లో నిరుద్యోగ యువత ఒకదాన్ని వదులుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. పరీక్షల తేదీలు మార్చాలని పలుమార్లు విజ్ఞప్తులు చేసినా టీజీపీఎస్సీ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. పరీక్షల తేదీలను పున: పరిశీలించాలని అక్టోబర్ 14వ తేదీనే టీజీపీఎస్సీకి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేఖ రాశారని ప్రస్తావించారు. నిరుద్యోగ యువత రెండు పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరారు.

నిరుద్యోగ యువత భవిష్యత్తును బలి చేయొద్దు..

ఒడిశా, బిహార్ వంటి రాష్ట్రాల్లో పరీక్షల తేదీలు మార్చినప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదు? అని హరీశ్‌రావు నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్.. భేషజాలకు పోయి నిరుద్యోగ యువత భవిష్యత్తును బలి చేయొద్దని హితవు పలికారు. తక్షణమే జోక్యం చేసుకొని నవంబర్ 6వ తేదీన జరగనున్న టీజీపీఎస్సీ ఏఈఈ (సివిల్) పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఎలాంటి గందరగోళం జరగకుండా ప్రభుత్వం, టీజీపీఎస్సీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హరీశ్‌రావు సూచించారు.

వరంగల్‌ను కరువు జిల్లాగా ప్రకటించాలి

26న కలెక్టరేట్ ఎదుట ఏఐకేఎంఎస్ ధర్నా



అక్షరశక్తి, నర్సంపేట: వరంగల్ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి, రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు డిమాండ్ చేశారు. ఈ నెల 26న వరంగల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని రైతులు, వ్యవసాయ కూలీలకు పిలుపునిచ్చారు. శనివారం నర్సంపేటలోని న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు జక్కుల తిరుపతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాచర్ల బాలరాజు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు తక్కువ వర్షపాతం నమోదైందని, జిల్లాలో పంటల దిగుబడి తగ్గడంతోపాటు ఎండల తీవ్రతకు పంటలు ఎండిపోయాయని తెలిపారు. వర్షాభావంతో బావులు, బోరుబావులు, చెరువుల్లో నీటిమట్టాలు తగ్గి వరి పంటలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. లోలోట్టేజీ కారణంగా మోటార్లు కాలిపోతున్నాయని, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా కూడా తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల రూపంలో డిస్కంలకు రూ.7,635 కోట్ల రికవరీకి అనుమతిస్తూ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, నవంబర్, డిసెంబర్ నుంచి యూనిట్‌కు 50 పైసలు పెంచే ప్రతిపాదనతో ప్రజలపై భారం పడుతుందని విమర్శించారు. రబీ సీజన్‌లో పంటలు వేయవద్దని సూచించిన ప్రభుత్వం.. రైతులు, వ్యవసాయ కూలీలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించకుండా, తక్షణ కరువు నివారణ చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కరువు పరిస్థితులపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నిర్వహించే ధర్నాలో రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గట్టి కృష్ణ, భీమగాని మల్లయ్య, గుగులోతు భద్రాజి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఐ హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

- **అధ్యక్ష, కార్యదర్శులుగా జవ్వాజి కిషన్, దండు మోహన్**




అక్షరశక్తి, హనుమకొండ: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జవ్వాజి కిషన్, ప్రధాన కార్యదర్శిగా దండు మోహన్ ఎన్నికయ్యారు. 1956 అక్టోబర్ 14న నాగ్‌పూర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సుమారు ఆరు లక్షల మంది అనుచరులతో కలిసి బౌద్ధమతాన్ని స్వీకరించిన సందర్భంగా ఈ నెల 14న హనుమకొండలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద బౌద్ధ విగ్రహానికి బుద్ధ వందనం చేశారు. అనంతరం బీఎస్ఐ హనుమకొండ జిల్లా నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు.ఎన్నికల అధికారిగా బీఎస్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉపాసకులు నక్క సుదర్శనం, ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మల అంబేడ్కర్ వ్యవహరించారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఉపాసకులు జి. పరంధాములు, రాష్ట్ర కార్యదర్శి మంత్రి బాలయ్య శనివారం ప్రకటించారు.

నూతన కార్యవర్గం

గౌరవ అధ్యక్షుడిగా పెరుమాండ్ల కృష్ణస్వామి, అధ్యక్షుడిగా జవ్వాజి కిషన్, ఉపాధ్యక్షులుగా దామెర నర్సయ్య, పెంబర్తి సాంబయ్య, తప్పెట సదానందం, కొంగర జగన్మోహన్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా దండు మోహన్, సంయుక్త కార్యదర్శులుగా సంకే హరిప్రసాద్, అడ్లూరి పద్మ, ఎస్. పవన్ కళ్యాణ్, కోశాధికారిగా కె. లక్ష్మీతులసి బాధ్యతలు చేపట్టనున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జంగిలి వెంకటస్వామి, కట్ట కుమార్, వస్కుల రవీందర్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ సోటాల మధుసూదన్, బండెల భద్రయ్య, జాన పట్ల సారయ్య, కొండ్రు నర్సింగరావు, గాదం రమేష్, పెరుమాండ్ల మధున, రాచమల్ల పోచయ్య, పెండ్లి అశోక్‌బాబులను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెల్లడించారు.

రైటర్లదే హవా..!



- పోలీస్‌స్టేషన్లలో భారీగా వసూళ్ల వ్యవస్థ?
- బెయిల్ నుంచి కేసుల నమోదు వరకు చేతులు తడపాల్సిందే ?
- లాంగ్‌స్టాండింగ్‌తో పాతుకుపోయి పట్టు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు
- వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో రైటర్ల వ్యవస్థపై ఆరోపణలు

అక్షరశక్తి, హన్మకొండ క్రైమ్ : పోలీస్‌స్టేషన్ అంటే బాధితులకు సత్వర న్యాయం లభించకపోయినా కొంత ఊరట లభించే ప్రదేశం. అన్యాయం జరిగిన వారు తమ గోడు వెళ్లబోసుకునే వేదిక. నేరగాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుని, బాధితులకు రక్షణ కల్పించే బాధ్యత ఇక్కడ ఉండే పోలీసులది. అయితే అలాంటి ప్రాధాన్యం ఉన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలంటే డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందనే ఆరోపణలు వస్తున్నాయి. పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, కేసుల వివరాల నమోదు, అధికారిక ఉత్తరప్రత్యుత్తరాలు, సిబ్బంది విధుల సమన్వయం వంటి కీలక బాధ్యతలు నిర్వర్తించే రైటర్ల పై వస్తున్న ఆరోపణలు అందుకు కారణమవుతున్నాయి. విధి నిర్వహణలో కీలకంగా ఉండాల్సిన కొందరు రైటర్లు, సిబ్బంది తమ స్థానాన్ని అడ్డం పెట్టుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌ఓ) ఎంత మంది మారినా రైటర్లు మాత్రం తమ పట్టు కోల్పోకుండా అక్కడే ఎళ్ల తరబడి నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వర్తిస్తూ వసూళ్ల దందా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు పోలీసు వర్గాల్లో చర్చకు దారితీస్తున్నాయి.

బెయిల్ రావాలంటే...

రైటర్లపై వస్తున్న ఆరోపణల్లో ప్రధానంగా బెయిళ్ల మంజూరు ఒకటి. నిందితులకు బెయిల్ రావడం అనేది నేర స్వభావం, దాని చట్టాలు, న్యాయస్థానంతో పాటు అధికారుల నిర్ణయాల ఆధారంగా ఉంటుంది. బెయిల్ ప్రక్రియలో సంబంధిత పత్రాలు, ఇతర వివరాలు, తదుపరి చర్యలకు సంబంధించిన అంశాల్లో రైటర్లది కీలక పాత్ర అని గుర్తించిన కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారు. బెయిల్ రావాలంటే తాను ఎంత డిమాండ్ చేస్తే అంతా ముట్టజెప్పాల్సిన పరిస్థితి రైటర్లు కల్పిస్తున్నారు. నిందితుల ఆర్థిక స్తోమత ఆధారంగా అధిక మొత్తంలో వసూలు చేసి ఎస్ హెచ్‌వోలు, ఇతర అధికారులకు స్థాయిని బట్టి పంచుతున్నారు. దీంతో పాటు కోర్టు కానిస్టేబుళ్లు, గన్‌మెన్లు, ఇతరులకు డబ్బులు ఇచ్చేలా నిందితులకు ఆదేశిస్తున్నారు. బెయిల్ మంజూరు డబ్బులు చెల్లిస్తేనే జరిగే ప్రక్రియ కాకపోయినా నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విధానాలతో న్యాయవవస్థపై ప్రజలు తమ విశ్వాసాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేస్తే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.

ఎఫ్‌ఐఆర్ నమోదులో జాప్యం ..

న్యాయం కోసం పోలీస్‌స్టేషన్ గడప తొక్కే బాధితుడు తన ఫిర్యాదుపై పోలీసులు ఎలా స్పందిస్తారనే అనుమానంతోనే పోలీసులను ఆశ్రయిస్తాడు. ఈక్రమంలో ఫిర్యాదుపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాల్సిన అధికారులు అనవసర జాప్యం చేస్తే ఇది బాధితులకు మరింత వేధిస్తుంది. ఈ విధానంతో పోలీసు వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తోంది. ఎఫ్‌ఐఆర్ నమోదులో రైటర్లు, అధికారులు కావాలనే ఆలస్యం చేస్తున్నారనే ఆరోపణలుతోనే ఈ పరిస్థితి కి కారణమవుతోంది. ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసినా బాధితులకు ఎలాంటి భరోసా లేకుండా వారు కోర్టును ఆశ్రయించే పరిస్థితిని కల్పిస్తున్నారు.

ఆర్థిక, సామాజిక స్తోమత ఆధారంగా ..

ఎఫ్ ఐ ఆర్ నమోదైన అనంతరం పోలీసులు అసలు తంతు మొదలు పెడుతున్నారు. నిందితుల ఆర్థిక, సామాజిక పలుకుబడి వివరాలు తెలుసుకుని, వారిని స్టేషన్‌కు పిలిపించడం నోటీసులు ఇవ్వడం, బెయిల్ మంజూరు చేయడం లాంటి విషయాలు చర్చించి డబ్బుల విషయం చర్చిస్తున్నారు. వారు ఇచ్చే డబ్బుల ఆధారంగా బెయిల్ మంజూరు ప్రక్రియ ముందుకు నడిపిస్తున్నారు. కేసు నమోదు, దర్యాప్తు, చర్యలు, చట్టం ఆధారంగా జరగాల్సి ఉన్నా డబ్బులు ఇచ్చినవారి విషయంలో ఒక విధంగా, ఇవ్వనివారి విషయంలో మరోవిధంగా వ్యవహరిస్తున్నారే ఆరోపణలున్నాయి. కేసులో వర్తించే అసలు సెక్షన్లు కాకుండా వాస్తవాల ప్రస్తావన, దర్యాప్తు నివేదికలను పట్టించుకోకుండా నిందితులు ఇచ్చే డబ్బుల ఆధారంగా, నిబంధనలకు విరుద్ధంగా కేసు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఎస్‌హెచ్‌ఓలు మారినా..

సాధారణంగా పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓ మారిన ప్పుడు పరిపాలనా విధానాలు, సిబ్బంది సమన్వయం, పనుల పర్యవేక్షణలో మార్పులు చోటుచేసుకోవచ్చు. కానీ కొందరు రైటర్లు, గన్‌మెన్లు, ఇతర సిబ్బంది మాత్రం స్టేషన్‌లో తమ స్థానాన్ని కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.కొత్తగా బాధ్యతలు స్వీకరించే అధికారితో సాన్నిహిత్యం పెంచుకుని, కీలక వ్యవహారాల్లో తమ ప్రాధాన్యాన్ని యధావిధిగా కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. దీర్ఘకాలం పాటు ఒకే స్థానంలో కొనసాగడం అవినీతికి ఆరోపణలకు దారితీస్తున్నాయి. ఐదేళ్ల తర్వాత బదిలీ ఉత్తర్వులు వచ్చినా, ఆ స్టేషన్‌కు వెళ్లకుండా పాత స్టేషన్‌లోనే కొనసాగేలా ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమార్జన కోసమే లాంగ్‌స్టాండింగ్ సిబ్బందిలో తమకు అనుకూలమైన వారిని అధికారులు కొనిసాగిస్తున్నారే విమర్శలు కూడా ఉన్నాయి. దీంతో అర్హులైన వారికి అవకాశం దక్కడం లేదని కొందరు సిబ్బంది వాపోతున్నారు.

డీఐజీ కార్యాలయంలో చర్యలు..

ఇటీవల డీఐజీ కార్యాలయంలో లాంగ్ స్టాండింగ్ పోస్టింగులో ఉండి పలు పోస్టింగుల పేరుతో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఇద్దరు అధికారులను సీపీ సస్పెండ్ చేశారు. ఇలా లాంగ్ స్టాండింగ్‌లో పలు స్టేషన్లలో ఉండే సిబ్బంది స్థానికంగా ఉండే క్రషర్ వ్యాపారులు, వైన్స్ దుకాణాలు, ఇసుక రవాణా, రెడీమిక్స్ యూనిట్లు, షాపింగ్ కాంప్లెక్సుల నుంచి వచ్చే నెలవారీ మామూళ్లను వసూలు చేసేందుకే అధికారులు వారిని యథాస్థానాల్లో కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

సమీక్ష అవసరం..

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 45 లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్లు, మూడు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉండగా ఒక్కో స్టేషన్‌లో ఇద్దరు చొప్పున రైటర్లు ఉంటారని, వారిలో ఒకరు మెయిన్ రైటర్ (ఐడబ్ల్యూ) కాగా మరొకరు డబ్బా రైటర్‌గా వ్యవహరిస్తారిస్తున్నారు. పరిపాలనా పనులు సజావుగా సాగడంలో రైటర్ల పాత్ర అవసరం కాగా ఒకే పోస్టులో దీర్ఘకాలం కొనసాగుతున్న సిబ్బంది కారణంగా పలు ఆరోపణలు వస్తున్నాయి. నిందితుల నుంచి నేరుగా డబ్బులు తీసుకోకుండా పెట్రోల్ బంకులు, వైన్స్ షాపులను అడ్డగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు సమీక్ష చేసి పరిపాలనా కార్యకలాపాలు, రికార్డుల నమోదు, కేసుల నమోదులో జాప్యం, బదిలీ ఉత్తర్వులు అమలు అంశాలపై ఉన్నతాధికారులు నిరంతరం సమీక్ష చేస్తే అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. తద్వారా పోలీసు వ్యవస్థపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగే అవకాశం ఉంది.

పరిపాలన పనుల్లో కీలక బాధ్యతలు..

ఎఫ్ఐఆర్‌లకు సంబంధించిన పత్రాలు, జనరల్ డైరీ, కేసుల వివరాలు, పెండింగ్ కేసుల రికార్డులు, ఉన్నతాధికారులకు పంపాల్సిన నివేదికలు, కోర్టు వ్యవహారాలకు సంబంధించిన పత్రాలు, సిబ్బంది డ్యూటీ వివరాలు తదితర పరిపాలనా పనుల్లో రైటర్లు కీలకంగా వ్యవహరిస్తారు. అధికారుల ఆదేశాల మేరకు పత్రాలను సిద్ధం చేయడం, కేసుల సమాచారాన్ని రికార్డుల్లో నమోదు చేయడం, స్టేషన్ పనులు సజావుగా సాగేందుకు సహకరించడం వీరి ప్రధాన బాధ్యతలు. ఈ స్థానంలో ఉన్న వీరికి స్టేషన్‌లో ఏ కేసు నమోదైంది ? వాటి దర్యాప్తు.. అరెస్టయిన వారి వివరాలు.. కేసుకు సంబంధించిన పత్రాలు కోర్టుకు పంపించడం.. ఫిర్యాదుపై చర్యలు వంటి సమాచారంపై వీరికి పూర్తి అవగాహన ఉంటుంది. ఈ పరిజ్ఞానాన్ని విధి నిర్వహణకు ఉపయోగించాల్సిన కొందరు దానిని ఆసరాగా చేసుకొని పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సగం రోడ్డు.. సగం పని..

- ప్రజలకు ఇబ్బందులు
- రూ.కోటి మంజూరైనా పూర్తికాని ఇస్సిపేట–చింతలపల్లి బీటీ రోడ్డు



అక్షరశక్తి, వరంగల్: ఇస్సిపేట నుంచి చింతలపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.100 లక్షలు మంజూరు చేసినప్పటికీ, పనులు ప్రారంభమై ఏడాది గడుస్తున్నా రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంపై గ్రామస్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. చింతలపల్లి గ్రామ ప్రజలు నిత్యం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించేవారు రోడ్డు ప్రమాదాల భయంతో ఆందోళన చెందుతున్నారు.ప్రజల ఓట్లు అవసరమైనప్పుడు హామీలు ఇచ్చి, వారి అవసరాలను తీర్చే విషయంలో కాలయాపన చేయడం సరికాదని గ్రామస్థులు పేర్కొన్నారు. ప్రజల ఆశలతో ఆడుకోకుండా వెంటనే రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి, చింతలపల్లి గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అనుమతి లేకుండా పటాకులు విక్రయిస్తే చర్యలు

- హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ హెచ్చరిక



అక్షరశక్తి/హసన్‌పర్తి: దీపావళి పండుగ నేపథ్యంలో ముందస్తు అనుమతులు లేకుండా పటాకులు, బాంబులను నిల్వ ఉంచినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ హెచ్చరించారు. బాణసంచా విక్రయించాలనుకునే వ్యాపారులు సంబంధిత అధికారుల నుంచి నిబంధనల ప్రకారం ముందస్తు లైసెన్సులు పొందాలని సూచించారు. నివాస ప్రాంతాల మధ్య, అనుమతి లేని ప్రదేశాల్లో బాణసంచా నిల్వ ఉంచడం నిషిద్ధమని స్పష్టం చేశారు. నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. అక్రమంగా పటాకులు నిల్వ ఉంచినట్లు గుర్తిస్తే సరుకును స్వాధీనం చేసుకోవడంతోపాటు బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు, వ్యాపారులు పోలీసులకు సహకరించి, నిబంధనలు పాటిస్తూ సురక్షిత వాతావరణంలో దీపావళి జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ మహేందర్ కోరారు.

పోచంపల్లిని కలిసిన పెద్ది స్వప్న

అక్షరశక్తి, వరంగల్, అక్టోబర్ 24: త్వరలో జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై బీఆర్ఎస్ నాయకులు చర్చించారు. ఈ ఎన్నికలకు సంబంధించి నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని వరంగల్ జిల్లా మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి శనివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, ఓటరు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టడం తదితర అంశాలపై ఇరువురు చర్చించారు.



దండు సమ్మన్న మృతి పట్ల ఎంసిపిఐ(యు) సంతాపం

- పార్టీకి , ప్రజా ఉద్యమాలకు తీరని లోటు



అక్షరశక్తి, నర్సంపేట : నర్సంపేట మండలం మాదన్నపేట గ్రామానికి చెందిన ఎంసిపిఐ (యు) పార్టీ సీనియర్ కార్యకర్త దండు సమ్మన్న మృతి పట్ల ఎంసిపిఐ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈరోజు అనారోగ్యంతో మృతి చెందిన సమ్మన్న మరణ వార్త తెలియగానే ఆయన మృతదేహంపై ఎర్రటి వస్త్రం కప్పి, పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి, త్యాగాల బాటలో పయనించాడన్నారు. నిర్బంధ సమయంలో అక్రమ కేసులు, జైలు నిర్బంధాలను తట్టుకొని పార్టీని విడవకుండా కడదాకా కొనసాగాడు. ఆయన మృతి పార్టీకి ప్రజా ఉద్యమాలకు తీరని లోటుగా భావించడం జరుగుతుంది. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర నాయకురాలు వంగాల రాగ సుధా, కొత్తకొండ రాజమౌళి, కేశెట్టి సదానందం, అనుమాల రమేష్, కర్నే సాంబయ్య, కేశెట్టి సూరయ్య, దండు రవి, రామ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన క్రిమినల్ చట్టాలపై సాయుధ దళాల సిబ్బందికి శిక్షణ



అక్షరశక్తి, వరంగల్: నూతన క్రిమినల్ చట్టాలపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ సూచనల మేరకు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఈ కార్యక్రమానికి కార్యాచరణ రూపొందించారు. కమిషనరేట్ పరిధిలో కానిస్టేబుల్ నుంచి కమాండెంట్ స్థాయి వరకు ఉన్న 971 మంది సాయుధ దళాల సిబ్బందిని 20 బృందాలుగా విభజించి, మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో రోజుకు ఒక బృందానికి శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా శనివారం మొదటి బృందానికి శిక్షణ కేంద్రం ఉప ప్రిన్సిపల్, ఏసీపీ రమణబాబు పర్యవేక్షణలో శిక్షణ ప్రారంభించారు. ఈ శిక్షణలో నూతన క్రిమినల్ చట్టాలు, ప్రథమ సమాచార నివేదిక నమోదు, అరెస్టు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేరస్థలంలో ఆధారాల సేకరణ, ధర్నాల నిర్వహణ, ముందస్తు అరెస్టులు, నేరాల వర్గీకరణ, మహిళలపై నేరాలు, ఉగ్రవాద నిరోధక చట్టాలు, సైబర్ నేరాలు, నేర విచారణలో పోలీసుల అధికారాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన న్యాయ శిక్షకుడు ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాశ్, సహాయ న్యాయ శిక్షకులు ఎస్ఐలు విజయ్, దేవేందర్, ఆర్ఐ ఉదయభాస్కర్, ఆర్ఎస్ఐ రమేష్‌తో పాటు శిక్షణ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడిన గంజాయి ధ్వంసం



అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్:- తెలంగాణా యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ గారి ఆదేశాల మేరకు, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 106 కేసులకు సంబంధించి, స్వాధీనం చేసుకున్న 967.864 కిలోల గంజాయిని, సుమారు రూ. 4,83,93,200 (రూ.4.83 కోట్ల) విలువైన గంజాయిని, డ్రగ్ డిస్పోజల్ కమిటీ వారు నిబంధనల ప్రకారం ధ్వంసం చేశారు. డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ అధ్వర్యంలో, ఈరోజు హనుమకొండ మండలం అమ్మవారిపేట గ్రామ శివారులో ఉన్న కాకతీయ మెడిక్లీన్ సర్వీస్ వారి భస్మీకరణ ప్లాంట్ లో గంజాయి ధ్వంస కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ నిరంతరం చర్యలు చేపడుతోందని, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటూ, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి పోలీస్ శాఖ కృషి చేస్తోందని డీసీపీ అంకిత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ(పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, సీసీఆర్బీ ఏసీపీ డేవిడ్ రాజు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నేనెప్పుడూ నక్సలైట్ అవుతానని అనుకోలేదు

- నాకు ఎలాంటి రాజకీయ బ్యాక్ గ్రౌండ్ లేదు
- కానీ కష్టాన్ని నమ్ముకొని పనిచేశాను
- మంత్రి సీతక్క





అక్షరశక్తి, హైదరాబాద్ : మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని తెలంగాణ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. స్త్రీల రాజకీయ ఎదుగుదలలో ఎన్నో సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఆయా సమస్యలకు భయపడకుండా వాటిని అధిగమించి వనితలు ఉన్నత స్థానాల్లోకి చేరుకోవాలని ఆకాంక్షించారు. శనివారం నాడు హైదరాబాద్ మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో.. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు.. మహిళా రాజకీయ నాయకత్వం సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ గురుదీప్ సింగ్ సత్పాల్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కోటా నీలిమ, పెద్దఎత్తున మహిళ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు.

నేను ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నా..

'నా చిన్నతనంలో నేను ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాను. ఆకలి బాధలు చూశాను.. అయినప్పటికీ అన్ని కష్టాలను ఎదుర్కొని.. నేడు ఈ స్థాయికి చేరుకున్నాను. ములుగు ప్రజల ఆశీర్వాదం, కాంగ్రెస్ పెద్దల అండదండలతో పంచాయతీరాజ్ శాఖకు మంత్రి కాగలిగాను. నాకు ఎలాంటి రాజకీయ బ్యాక్ గ్రౌండ్ లేదు. అపర వనరులు ఉన్నప్రాంతం ములుగు. అలాంటి ప్రాంతంలో ఒక పేద కుటుంబంలో నేను జన్మించాను. చిన్నతనంలో అన్యాయాలను చూడలేకే నక్సలైట్ అయ్యాను. నేనెప్పుడూ నక్సలైట్ అవుతానని అనుకోలేదు.. కానీ నక్సలైట్ అయ్యాను. ఆ తర్వాత లాయర్, ఎమ్మెల్యే, మంత్రి అవుతానని ఎన్నడూ ఊహించలేదని.. కానీ కష్టాన్ని నమ్ముకొని పనిచేశాను. నేడు మంత్రిగా మీ ముందు ఉన్నాను' అని మంత్రి సీతక్క తెలిపారు.

ప్రజలతోనే ఉండాలనేది నా సిద్ధాంతం...

'నేను మంత్రిగా ఉన్నప్పటికీ ఎప్పుడు నా మూలాలు మరిచిపోలేదు. ప్రజాజీవితమంటే జనంతోనే ఉండాలి. ఇప్పటికీ ప్రతివారం రెండు రోజులు.. నేను ములుగు ప్రజల మధ్యనే ఉంటాను. జనం ఎన్నుకున్నారని.. వారితోనే ఉండాలనేది నా సిద్ధాంతం. ఎమ్మెల్యే, మంత్రి కాగానే ప్రజలతో దూరంగా ఉండాలని.. అప్పుడే గౌరవం ఉంటుందని కొందరు భావిస్తారని.. కానీ నేను ఆ భావనకు పూర్తి విరుద్ధం. మేము ప్రజలకు జవాబుదారులమని.. బాసులం కాదని.. మనం సేవకులం. నాయకులకు ప్రజలే బలం. అయితే మహిళలు ఉన్నతస్థాయికి ఎదిగినా వివక్షతను ఎదుర్కొంటున్నారు. పురుష మంత్రులకు ఇచ్చినంత గౌరవం.. మహిళా మంత్రులకు ఇవ్వరు. అయినప్పటికీ మనం వెనకడుగు వేయాల్సిన అవసరం లేదు. డెడికేషన్, డిటర్మినేషన్‌తో పనిచేస్తూ పోవాలి. నా జీవితం కష్టాల కలపోత, పోరాటాలమయం. నా కష్టాలను, పోరాటాలను ఎప్పటికీ మర్చిపోను' అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

నవంబర్ 1న జరిగే ర్యాలీని వాయిదా వేసుకోండి

- రాహుల్ గాంధీకి వ్యాపార సంఘాల వినతి



అక్షరశక్తి, డెస్క్ : నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ సహా ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టనున్న సంగతి తెలిసిందే. అయితే, దీపావళిని దృష్టిలో ఉంచుకుని ఈ ర్యాలీని వాయిదా వేసుకోవాలని ది ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) కోరింది. లేకపోతే రూ.10,000 కోట్ల వరకు నష్టం వాటిల్లుతుందని వివరించింది. ఈ మేరకు సీటీఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్ రాహుల్ గాంధీని కోరారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో రాంలీలా మైదానంలో ర్యాలీ జరగనుంది. ఈ ర్యాలీ సందర్భంగా ఆ రోజు వ్యాపార సంస్థలు అన్నీ మూసేయాల్సి ఉంటుంది. అలాగే, ముందు నుంచే అక్కడ పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలి. దీంతో ర్యాలీకి కొద్ది రోజుల ముందునుంచే వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుంది. ఈ నేపథ్యంలో సీటీఐ తరఫున ఆ సంస్థ చైర్మన్ బ్రిజేష్ గోయల్.. రాహుల్ గాంధీకి లేఖ రాశారు. ఆయన లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. దీపావళి, ధంతేరాస్ సందర్భంగా ఈ ప్రాంతంలో రూ.25,000 కోట్ల వ్యాపారం జరుగుతుంది.

బంగారం, వెండితోపాటు ఎలక్ట్రానిక్స్, దుస్తులు, పంట సామగ్రి, డ్రైఫ్రూట్స్, స్వీట్స్, వాహనాలు, ఆస్తుల కొనుగోలు, గిఫ్ట్ ఐటమ్స్ వంటివి భారీ స్థాయిలో అమ్ముడుపోతాయి. అయితే, ఇండియా బ్లాక్ ర్యాలీ వల్ల ఈ వ్యాపారాలకు ఆటంకం కలుగుతుంది. దీనివల్ల రూ.10,000 కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉంది. నవంబర్ 6న ధంతేరాస్, 8న దీపావళి, 10న భాయ్ దూజ్ వంటి పండుగలున్నాయి. అందువల్ల నవంబర్ 10 వరకు ఈ ర్యాలీని వాయిదా వేసుకోవాల్సిందిగా సూచించారు. పండుగలకు వారం రోజుల ముందు నుంచి వ్యాపారం ఉధృతంగా సాగుతుందన్నారు. ఇప్పటికే అక్టోబర్‌లో సాగిన అనేక ర్యాలీల వల్ల తీవ్రంగా నష్టపోయామన్నారు. రోడ్లు బ్లాక్ చేయడం, రవాణా సదుపాయం లేకపోవడం, ప్రభుత్వ ఆంక్షల వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. అందువల్ల తమ విన్నపాన్ని దృష్టిలో ఉంచుకుని నవంబర్ 10 వరకు ర్యాలీని వాయిదా వేసుకోవాలని, ఆ తర్వాతే ర్యాలీ నిర్వహించుకోవాలని సూచించారు.

పోలీస్‌స్టేషన్ నిర్వహణపై ఎస్పీ తనిఖీ





అక్షరశక్తి, భూపాలపల్లి, అక్టోబర్ 24: వార్షిక తనిఖీల్లో భాగంగా భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ శనివారం కొత్తపల్లిగోరి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, పరిశుభ్రత, రికార్డులు, వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది క్రమశిక్షణ, యూనిఫాం నిర్వహణను పరిశీలించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణ, సంక్షేమానికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు.

స్టేషన్‌లోని సీసీటీవీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఎస్పీ.. నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో జాప్యం చేయకుండా దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, విజిబుల్ పోలీసింగ్, నిఘా పెట్రోలింగ్, కమ్యూనిటీ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలను అరికట్టడంతోపాటు రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. సీసీటీఎన్ఎస్ 2.0, ఈసాక్ష్య, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ దర్యాప్తు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సిబ్బంది అవగాహన పెంచుకోవాలని తెలిపారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరిస్తూ పోలీస్ శాఖపై నమ్మకాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో భూపాలపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ సంపత్ రావు, ఘణపురం సీఐ కర్ణాకర్ రావు, ఎస్ఐ త్రిలోక్‌నాథ్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సాహిత్య చైతన్య పుష్పం - తిరునగరి దేవకి దేవి అక్కగారు

75 జన్మదిన వేడుక సందర్భంగా ఉద్యమ కారురాలికి ప్రజా సాహిత్య దీప్తికి అక్షర నీరాజనం

ఓరుగల్లు పోరాటాల పురిటిగడ్డ నుంచి పుట్టిన చైతన్య అక్షర ప్రవంతికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

ఓరుగల్లు గుండెల్లో పుట్టిన చైతన్యం...

ప్రజల కన్నీళ్లలో తడిసిన అక్షరం...

స్త్రీల ఆత్మగౌరవ పోరాటాల్లో వినిపించిన స్వరం...

సమానత్వ సమాజం కోసం పరితపించిన ఆశయం...

ఆ చైతన్యానికి రూపం — తిరునగరి దేవకి దేవి అక్కగారు!



ఓరుగల్లు పోరాటాల పురిటిగడ్డ. చరిత్రకు సాక్షి, ప్రజా ఉద్యమాలకు ఊపిరి, సామాజిక చైతన్యానికి నిలయం. అలాంటి నేలలో పుట్టి, పెరిగి, విద్యను అభ్యసించి, ఆ నేలలోని పోరాటాల స్ఫూర్తిని తన ఆలోచనల్లో నింపుకుని, ప్రజల పక్షాన నిలిచిన అక్షర స్వరంగా ఎదిగిన తిరునగరి దేవకి దేవి అక్కగారికి 75వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం ఒక ఆత్మీయ సందర్భం మాత్రమే కాదు — ఓరుగల్లు గుండె నుంచి పుట్టిన చైతన్య అక్షర స్రవంతికి అందించే అక్షర నీరాజనం.

మీరు పుట్టిన నేల మీకు కేవలం జన్మభూమి కాదు; అది మీ ఆలోచనలకు పునాది, మీ పోరాటాలకు ప్రేరణ, మీ సాహిత్యానికి జీవనాడి. ఓరుగల్లు మట్టిలోని చారిత్రక చైతన్యం, ప్రజల జీవితాల్లోని సంఘర్షణలు, సమానత్వం కోసం సాగిన పోరాటాలు మీ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి.

మీ జననం ఒక కుటుంబంలో వెలుగు పుష్పంలా వికసించినా, మీ జీవన ప్రయాణం కుటుంబ సరిహద్దులను దాటి సమాజపు విశాల ప్రాంగణంలో పరిమళించింది. ఆ పుష్పానికి పేరు — ప్రజా చైతన్య పుష్పం

కాలాన్ని దాటి, తరాలను తాకుతూ, మానవతా పరిమళాలను వెదజల్లుతున్న ఆ చైతన్య పుష్పం ఈ రోజు 75వ జన్మదిన వేడుకలు జరుపుకుంటుంది.

మీరు ఒక కుటుంబానికి ఆత్మీయురాలు మాత్రమే కాదు, ప్రజల పక్షాన నిలిచిన అక్షరం, అన్యాయాన్ని ప్రశ్నించిన స్వరం, అణగారిన జీవితాలకు అండగా నిలిచిన చైతన్యం. మీ జీవితాన్ని తలుచుకుంటే గర్వం కలుగుతుంది; మీ పోరాటాన్ని గుర్తుచేసుకుంటే కొత్త ఆలోచనలు ఉదయిస్తాయి; మీ సాహిత్యాన్ని చదివితే సమాజాన్ని మరోసారి పరిశీలించాలనే తపన కలుగుతుంది.

సాధారణ కుటుంబంలో జన్మించి, కష్టాల కడలిని దాటి, విద్యను ఆయుధంగా, వివేకాన్ని మార్గదర్శిగా చేసుకుని మీరు సాగించిన జీవన ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకమైన పాఠం.

ఓరుగల్లు నేల మీకు జన్మభూమి మాత్రమే కాదు — మీ చైతన్యానికి జన్మస్థానం. ఈ నేలలోని పోరాటాల చరిత్ర మీ ఆలోచనలకు ఊపిరిపోసింది. ప్రజాకవి కాళోజీ ప్రశ్నించే తత్వం, ప్రజాకవి వరవరరావు ప్రజా ఉద్యమాల స్ఫూర్తి, సమానత్వం కోసం పరితపించే ప్రగతిశీల భావజాలం మీ జీవన ప్రయాణంలో ప్రతిధ్వనించాయి. అన్యాయాన్ని చూసి మౌనంగా ఉండలేని మనస్తత్వం, అసమానతలను చూసి ప్రశ్నించాలనే తపన, స్త్రీలకు సమాన హక్కులు కావాలనే ఆకాంక్ష, ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛా స్వరాలు కావాలనే ఆశయం — ఇవన్నీ మీ వ్యక్తిత్వంలో అంతర్భాగమయ్యాయి.

తెలంగాణ తొలి దశ ఉద్యమం నుంచి మలి దశ ఉద్యమం వరకూ, స్త్రీ హక్కుల పోరాటాల నుంచి ప్రజాస్వామిక ఉద్యమాల వరకూ మీ గొంతు వినిపించిన ప్రతిచోటా ఒక ప్రశ్న ప్రతిధ్వనించింది:

మనిషికి గౌరవం ఎక్కడ?
సమాజానికి సమానత్వం ఎప్పుడు?

మీ ఉద్వేగభరిత ప్రసంగాలు, మీ ఆలోచనల పదును, మీ ప్రశ్నల్లోని నిబద్ధత — ఇవన్నీ ఓరుగల్లు నేల ప్రజా చైతన్యపు జ్ఞాపకాల్లో చెరగని ముద్రలుగా నిలిచాయి.

హనుమకొండలో మొదలైన మీ విద్యా ప్రయాణం తెలుగు సాహిత్య స్రవంతిలో ఒక వెలుగురేఖగా విస్తరించింది. వికారాబాద్‌లో ఉపాధ్యాయురాలిగా మీరు విద్యార్థుల జీవితాలను స్పృశించారు. మీరు నేర్పింది కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానం కాదు. ప్రశ్నించడం, ఆలోచించడం, మనిషిని మనిషిగా గౌరవించడం, సమాజం పట్ల బాధ్యతగా జీవించడం కూడా నేర్పించారు.

మీ తరగతి గది విద్యార్థులకు విజ్ఞాన మందిరమైతే, మీ జీవితం వారికి మానవతా పాఠశాలగా నిలిచింది. మీ అక్షరాల్లో ప్రజల బాధ పలికింది. మీ ఆలోచనల్లో సమాజ మార్పు తొంగిచూసింది. మీ కలంలో స్త్రీల ఆవేదన రూపుదిద్దుకుంది. మీ పోరాటంలో అణగారిన మనిషి ఆత్మగౌరవం ప్రతిఫలించింది. మీరు జీవిత సహచరిగా మాత్రమే కాదు, ఆశయ సహచరిగా కూడా నిలిచారు.

అమరుడు కామ్రేడ్ శంకరన్నతో ఆశయ అనుబంధం
అమరుడు కామ్రేడ్ శంకర్ అన్నతో మీ బంధం కేవలం కుటుంబ బంధం కాదు; ప్రజల కోసం కలలు కన్న రెండు హృదయాల అనుబంధం, న్యాయం కోసం నడిచిన రెండు అడుగుల ప్రయాణం, మానవ గౌరవం కోసం నిలిచిన రెండు సంకల్పాల సంగమం.

పేదల పక్షాన నిలబడి, ప్రజల హక్కుల కోసం పోరాడిన శంకరన్న జీవితం ఎన్నో త్యాగాలకు ప్రతీకగా నిలిచింది. రాజ్య హింస ఉధృతమైన కాలంలోనూ మీరు ప్రదర్శించిన ధైర్యం, మీరు నిలబెట్టుకున్న విలువలు, మీ మౌన సహచర్యం, మీ ఆత్మబలం ఆయన ఆశయ ప్రయాణానికి తోడుగా నిలిచాయి.

వికారాబాద్ నేలపై శంకరన్న సాగించిన ప్రజా పోరాటాల జ్ఞాపకాలు ఈనాటికీ సజీవంగా ఉన్నాయి. ఆ చరిత్రలో ఆయన అడుగుజాడలతోపాటు మీ నిబద్ధతకు కూడా ప్రత్యేక స్థానం ఉంది. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు మీ ఆలోచనల్లో జీవిస్తున్నాయి; ఆయన పోరాట స్ఫూర్తి మీ అక్షరాల్లో పలుకుతోంది; ఆయన ప్రజా జీవితపు విలువలు మీ జీవన ప్రయాణంలో కొనసాగుతున్నాయి.

ఒకరి జీవితం పోరాటమైతే, మరొకరి జీవితం ఆ పోరాటపు విలువలను నిలబెట్టే నిబద్ధతగా మారింది. శంకరన్న ఆశయాల జ్ఞాపకాలకు మీరు అందిస్తున్న అక్షర నివాళి, మీ జీవన ప్రయాణంలో ఒక విలువైన అధ్యాయం.

మీ రచనలు — ప్రజా జీవితానికి అక్షర సాక్ష్యాలు
మీ రచనలు మీ జీవిత సత్యాలకు అక్షర సాక్ష్యాలు. అవి కేవలం పుస్తకాలు కావు; సమాజాన్ని పరిశీలించే కిటికీలు, చరిత్రను అర్థం చేసుకునే మార్గాలు, మనిషి అంతరంగాన్ని ఆవిష్కరించే సాహిత్య దీపాలు.

"తెలంగాణ విమోచనోద్యమ నవల్లో శ్రీచైతన్యం"లో చరిత్రను సాహిత్య దృష్టితో పరిశీలించారు.
"బతుకమ్మ పాటలోని స్త్రీల మనోభావాలు"లో తెలంగాణ మహిళల హృదయ స్పందనలను పరిశోధనతో, సున్నితమైన అవగాహనతో ఆవిష్కరించారు.
"పిడికిటి ఇసుక"లో సామాన్య మనిషి జీవితంలోని నిశ్శబ్ద వేదనకు అక్షర రూపం కల్పించారు.
"అరుదైన ఛాయాచిత్రం"లో జీవితపు అంతరంగపు కోణాలను సాహిత్య దర్పణంలో ప్రతిబింబించారు.
"బతుకమ్మ కుటుంబ సంబంధాలు బాధ గేయాలు"లో తెలంగాణ స్త్రీల అనుభవాలు, కుటుంబ సంబంధాల్లోని భావోద్వేగాలు, పూల పండుగ వెనుక దాగిన సామాజిక జీవితానికి ప్రజా సాహిత్యపు స్వరాన్ని అందించారు.

మీ ప్రతి రచన ఒక ఆలోచనకు ఆహ్వానం. ప్రతి పుస్తకం ఒక సామాజిక ప్రశ్న. ప్రతి వాక్యం ఒక జీవనానుభవం. ప్రతి అక్షరం ఒక చైతన్యపు జ్యోతి. "విశ్లేషణీయం", "చింగారి", "కరోనా కాలం కథలు" వంటి సంపాదకత్వ కృషిలోనూ మీ సాహిత్య నిబద్ధత ప్రతిఫలించింది.

ముఖ్యంగా "శంకరయ్య గారి స్మారక సంచిక" మీ ఆశయ బంధానికి అక్షర నివాళిగా నిలిచింది. అందులోని మీ కవిత — "నేను ఎట్లా అపవిత్రురాలినయ్యా" — ఒక వ్యక్తి అంతరంగపు వేదన మాత్రమే కాదు; స్త్రీ జీవితాన్ని ప్రశ్నించే సమాజానికి ఎదురుగా నిలిచిన ఆత్మగౌరవ స్వరం. ఆ కవితలోని ప్రతి భావం ఒక మనసు విరుపు, ఒక జీవన సంఘర్షణ, ఒక స్త్రీ ఆత్మగౌరవపు నిశ్శబ్ద గర్జన.
మీరు అక్షరాలను సవరించే సంపాదకురాలు మాత్రమే కాదు; అక్షరాల ద్వారా సమాజాన్ని ఆలోచింపజేసే రచయిత్రి. మీ కలం గతాన్ని నమోదు చేస్తూనే, భవిష్యత్తును ప్రశ్నించమని పిలుస్తోంది.

మీ కూతురు నవత, మీ కుమారుడు రాహుల్ శంకృత్యాయన్ మీ ఆలోచనలకు, మీ ప్రేమకు, మీ విలువలకు ఆత్మీయ వారసులుగా నిలుస్తున్నారు. మీ మనుమడు విహాన్ చిరునవ్వులో మీ ఇంటి ఆనందం విరబూస్తోంది; అతని చిన్ని అడుగుల్లో రేపటి ఆశలు కనిపిస్తున్నాయి. శంకరన్న జ్ఞాపకాలు మీ హృదయంలో నిలిచినట్లే, ఆయన ఆశయాల ప్రతిధ్వనులు తరతరాలకు చేరాలని కోరుకుంటున్నాం.
75వ వసంతం — ఆరోగ్య పోరాటం నుంచి కొత్త ఆశల వైపు
దేవకి దేవి అక్కగారూ, ఈ సంవత్సరం మీ జీవన ప్రయాణంలో మరొక ప్రత్యేకమైన మలుపు!
మీరు 75వ జన్మదినోత్సవం జరుపుకుంటున్న ఈ వేళ, మీ జీవితంలో ఎదురైన అనారోగ్యపు పరీక్షను తలుచుకుంటే మనసు ఆవేదనతో నిండిపోతుంది. ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలతో శ్వాస తీసుకోవడమే ఒక సవాలుగా మారిన రోజులు, ఆక్సిజన్ సహాయంతో గడపాల్సి వచ్చిన క్షణాలు, శరీరం అలసిపోయినా మనసు మాత్రం ఓటమిని అంగీకరించని సమయాలు — ఇవన్నీ మీ జీవన ప్రయాణంలోని కఠినమైన అధ్యాయాలు.

ఆ క్లిష్టమైన రోజుల్లోనూ మీరు చూపిన ధైర్యం స్ఫూర్తిదాయకం. మీ పిల్లల ప్రేమ, వైద్యుల సేవలు, ఆత్మీయుల అండదండలు మీకు తోడయ్యాయి. వారి సహకారంతో మీరు క్రమంగా కోలుకుంటున్న తీరు మీ ఆత్మీయుల హృదయాల్లో కొత్త ఆశను నింపింది.

ఆరోగ్యం మనిషిని కొన్నిసార్లు నాలుగు గోడల మధ్యకు పరిమితం చేయవచ్చు. కానీ ప్రజల పట్ల నిబద్ధతను, సమాజం పట్ల బాధ్యతను, న్యాయం పట్ల విశ్వాసాన్ని అంత సులభంగా బంధించలేదని మీ జీవితం మళ్లీ గుర్తుచేసింది.
మీకు ఊపిరి కష్టమైన ఆ రోజుల్లోనూ ప్రజల గొంతుకలు మీ మనసుకు దూరం కాలేదు. అణచివేతకు గురైనవారి ఆక్రందనలు, న్యాయం కోసం ఎదురు చూసే వారి ఆశలు, ప్రజాస్వామిక హక్కుల కోసం వినిపించే నినాదాలు మీ అంతరంగంలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి.

ఒక ప్రజాస్వామిక సమావేశంలో ఒక గొంతుకకు అండగా నిలవాలనే ఆలోచన, ఒక ఉద్యమానికి సంఘీభావం తెలపాలనే ఆకాంక్ష, ఒక బాధితుడి పక్కన నిలవాలనే తపన — ఇవే మీ జీవితపు అసలైన బలాలు.

మీకు ప్రజల పట్ల ఉన్న ప్రేమే మీ ఆత్మబలం; ప్రజల కోసం నిలవాలనే ఆశయమే మీ చైతన్య శ్వాస!

మీరు ఆరోగ్యం కొంత కోలుకుంటున్న సమయంలో హైదరాబాద్‌లో నటుడు, సామాజిక ఉద్యమకారుడు ప్రకాష్ రాజ్ పక్కన ఒక సమావేశంలో పాల్గొన్న సందర్భం గుర్తుకొస్తోంది ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుంటే ధిల్లీ జంతర్ మంతర్ వద్ద మీరు నిలబడి ప్రసంగించినట్లు మాకు స్ఫూర్తినిచ్చింది మీ ఆరోగ్యం ఏమాత్రం కొంచెం మంచిగా ఉన్నా తప్పకుండా ధిల్లీలో జంతర్ మంతర్ తాకి మీ సంఘీభావాన్ని కాక్రోచుల యుద్ధం జంnజి ప్రజా ఉద్యమాలకు, తెలియజేస్తారని
ప్రజాస్వామిక నిరసనల మధ్య, న్యాయం కోసం ఎదురుచూస్తున్న గొంతుల మధ్య మీరు నిలబడగలిగే మనోధైర్యం మీకు ఉందనేది స్ఫూర్తిదాయకం. శరీరం విశ్రాంతిని కోరుతున్నా, మనసు మాత్రం సమాజం వైపు నడవడం మీ జీవితంలో కొత్తగా పుట్టిన లక్షణం కాదు; దశాబ్దాలుగా మీరు ఆచరిస్తున్న ప్రజా నిబద్ధతకు కొనసాగింపు.

అయితే, మాకు మీ ఆరోగ్యమే మా మొదటి ఆకాంక్ష. మీరు సంపూర్ణంగా కోలుకోవాలి, మరిన్ని సంవత్సరాలు ఆరోగ్యంగా జీవించాలి, మీ అనుభవాలను, మీ రచనలను తరతరాలతో పంచుకోవాలి. ప్రజా ఉద్యమాలకు సంఘీభావం తెలపడం మీ హక్కు, మీ ఆశయం, మీ వ్యక్తిత్వంలో భాగం. అదే సమయంలో



మీ ఆరోగ్యానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, వైద్యుల సూచనలను పాటిస్తూ, మీకు సాధ్యమైన మార్గాల్లో మీ చైతన్య ప్రయాణాన్ని కొనసాగించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.
ఎందుకంటే మీరు ఆరోగ్యంగా ఉండటం మీ కుటుంబానికే కాదు, మీ అక్షరాల కోసం ఎదురుచూసే పాఠకులకు, మీ అనుభవాల నుంచి నేర్చుకునే యువతకు, మీ స్ఫూర్తిని గౌరవించే ప్రజలకు కూడా ఎంతో విలువైన విషయం.

75 ఏళ్లు — ఒక జీవన చరిత్ర, ఒక ఉద్యమ గాథ

75 ఏళ్లు అంటే కేవలం వయస్సు కాదు; అది అనుభవాల అక్షరమాల, పోరాటాల చరిత్ర, ప్రేమకు చిరునామా, నిబద్ధతకు నిదర్శనం. మీ గతం ఒక ఉద్యమ గాథ. మీ వర్తమానం ఒక ధైర్య సందేశం. మీ భవిష్యత్తు మరిన్ని ఆశల పుష్పగుచ్ఛం కావాలి.

మీరు రాసిన అక్షరాలు ఇంకా నడవాలి. మీరు లేవనెత్తిన ప్రశ్నలు ఇంకా వినిపించాలి. మీరు కలగన్న సమానత్వ సమాజం కోసం కొత్త తరాలు ఆలోచించాలి. కొత్త గొంతుకలు ధైర్యంగా పలకాలి. అధికారానికి ప్రశ్న ఎదురవ్వాలి. అసమానతకు ప్రతిఘటన ఎదురవ్వాలి. స్త్రీకి సమాన గౌరవం దక్కాలి. అణగారిన మనిషికి న్యాయం అందాలి. ప్రజాస్వామ్యానికి ప్రజలే ప్రాణమని మన సమాజం నిరంతరం గుర్తుంచుకోవాలి. ఇదే మీ జీవితం నేర్పిన పాఠం. ఇదే మీ సాహిత్యం అందించిన సందేశం. ఇదే మీ ఆశయ సహచరుడు శంకరన్నకు మనమందరం అందించగలిగే నిజమైన నివాళి.
ఓరుగల్లు నేలలో పుట్టిన మీరు, ఆ నేలలోనే విద్యను అభ్యసించి, ఆ నేల పోరాటాల స్ఫూర్తిని మీ గుండెల్లో నింపుకుని, మీ అక్షరాలతో తెలంగాణ ప్రజా చైతన్యానికి ఒక ప్రత్యేకమైన స్వరాన్ని అందించారు.

అందుకే మీ 75వ జన్మదినం వ్యక్తిగత వేడుకగా మాత్రమే మిగలకూడదు. ఓరుగల్లు నేల తన గుండె నుంచి పుట్టించిన చైతన్యానికి, ప్రజల పక్షాన నిలిచిన సాహిత్యానికి, స్త్రీల ఆత్మగౌరవ పోరాటాలకు, ప్రజాస్వామిక విలువలకు అక్షరాల ద్వారా అందించే గౌరవంగా నిలవాలి.

ఓరుగల్లు గుండె నుంచి పుట్టిన చైతన్య పుష్పానికి జన్మదిన నీరాజనం
తిరునగరి దేవకి దేవి అక్కగారూ!
మీ 75వ జన్మదినోత్సవం జరుపుకుంటున్న ఈ శుభవేళ మీకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

మీ పిల్లలు మీకు అందిస్తున్న ప్రేమ, మీ మనుమడు విహాన్ పంచుతున్న ఆనందం, మీ ఆత్మీయులు అందిస్తున్న అండదండలు మీ జీవితంలో కొత్త ఉత్సాహాన్ని నింపాలని కోరుకుంటున్నాం.
మీ సంతోషంలో మీ ఆత్మీయులందరూ భాగస్వాములవుతారు. మీ కష్టంలో మీకు తోడుగా నిలుస్తారు. మీ ఆరోగ్య పరిరక్షణకు అండగా ఉంటారు. మీ ఆశయాలకు సంఘీభావం అందిస్తారు.

మీరు ఒంటరి కాదు — మీ వెనుక కుటుంబం ఉంది, మీ పక్కన ఆత్మీయులు ఉన్నారు, మీ అక్షరాల్లో ప్రజల జ్ఞాపకాలు ఉన్నాయి, మీ ఆశయాల్లో రేపటి సమాజం ఉంది. మీ జీవితంలో ఆరోగ్యపు వెలుగులు విరియాలి. మీ ఇంట ఆనందాలు వెల్లివిరియాలి. మీ కలం మరిన్ని సత్యాలను వెలికితీయాలి. మీ ఆలోచనలు మరిన్ని తరాలను మేల్కొలపాలి.

మీ 75వ జన్మదినం కేవలం ఒక వేడుకగా మిగలకూడదు; మీ జీవన పోరాటానికి, మీ సాహిత్య సేవకు, మీ ప్రజా నిబద్ధతకు, మీ మానవతా విలువలకు ఒక ఆత్మీయ ఉత్సవంగా నిలవాలి.

తిరునగరి దేవకి దేవి అక్కగారు —
మా ఆత్మీయతలో ఒక చైతన్య పుష్పం...
ఓరుగల్లు ప్రజా చైతన్యపు అక్షర స్వరం...
తెలంగాణ స్త్రీల ఆత్మగౌరవ పోరాటాల సహచరి...
ప్రజాస్వామిక విలువల పట్ల నిబద్ధురాలు...
ప్రజా సాహిత్య లోకంలో వెలుగుతున్న జ్యోతి...
మీరు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా, ఆత్మవిశ్వాసంతో జీవించాలి.
మీకు దీర్ఘాయుష్షు కలగాలి!
మీకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలి!
మీ అక్షరాలకు మరింత పదును రావాలి!
మీ ప్రజా చైతన్యం తరతరాలకు పాకాలి!

మీ ఊపిరిలో ఆరోగ్యం, మీ హృదయంలో మానవత, మీ కలంలో చైతన్యం, మీ జీవితంలో ఆనందం ఎల్లవేళలా నిండిపోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాం.
చైతన్య పుష్పం ఎప్పటికీ వాడిపోకూడదు —
ఓరుగల్లు గుండెల్లో వికసించిన ఆ పరిమళం తరతరాలకు చేరాలి!

ఓరుగల్లు పోరాటాల పురిటిగడ్డలో పుట్టి, పెరిగి, చదువుకుని, ప్రజా చైతన్యానికి అక్షర రూపమిచ్చిన మీ జీవితం మరెందరికో స్ఫూర్తిగా నిలవాలి.

మీరు అందించిన సాహిత్య పరిమళం మరింత విస్తరించాలి. మీరు లేవనెత్తిన ప్రశ్నలు మరింత బలంగా ప్రతిధ్వనించాలి. మీరు కలగన్న మానవతా సమాజం సాకారం కావాలి.
ప్రజల కోసం పరితపించే మీ హృదయానికి, సమాజాన్ని ప్రశ్నించే మీ కలానికి, సమానత్వాన్ని కలగనే మీ ఆశయాలకు మా అక్షర వందనం.
ప్రేమతో, గౌరవంతో, ఆత్మీయతతో,
ప్రజా చైతన్య స్ఫూర్తితో...
ఓరుగల్లు పోరాటాల పురిటిగడ్డ స్ఫూర్తితో, ప్రజా సాహిత్యాన్ని ప్రేమించే హృదయాల తరపున

తిరునగరి దేవకి దేవి అక్కగారికి 75వ జన్మదిన శుభాకాంక్షల అక్షర సమర్పణ

— మానవత (కలం పేరు)
రేపల్లె నరోత్తమ సూరి,
అధ్యక్షులు
బి హ్యూమన్ ఫోరం
తెలంగాణ
దుర్గ భవాని,సోనాలి శ్రీ
ఆనందిని,భీమ్ రాజన్
సమర్పించు ప్రేమ పూర్వక అక్షర సమర్పణ



పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

అక్షరశక్తి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి హామీ ఇచ్చినట్లు పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై. రాంబాబు తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో పార్ట్‌టైం అధ్యాపకుల సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్‌ను సంఘం ప్రతినిధులు కలిశారు. నియామకాల సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకులకు కల్పిస్తున్న రక్షణలను పార్ట్‌టైం అధ్యాపకులకూ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. వారి సమస్యలను పరిశీలించి, పరిష్కారానికి సహకరిస్తామని చైర్మన్ హామీ ఇచ్చినట్లు రాంబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి నరేంద్ర నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవోజి నాయక్, డాక్టర్ తిరునరి శేషు, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సొంతింటి కలను నెరవేస్తాం..

మంత్రి పొంగులేటి



అక్షరశక్తి, హైదరాబాద్: జర్నలిస్టులకు ఇళ్లస్థలాలపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం నాడు కీలక ప్రకటన చేశారు. జర్నలిస్టుల సొంతింటి కల సాకారం చేస్తామని.. వారికి ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. న్యాయపరమైన చిక్కులు లేని విధంగా స్థలాలను కేటాయిస్తామని స్పష్టం చేశారు. నివాసయోగ్యమైన ప్రాంతంలో ఇళ్లస్థలాలు అందిస్తామని చెప్పుకొచ్చారు. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఇళ్లస్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పలుమార్లు ఈ విషయంపై చర్చించామని మంత్రి పొంగులేటి తెలిపారు. జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ అంశంపై సమీక్షిస్తున్నామని అన్నారు. గతంలో న్యాయపరమైన చిక్కులతో స్థలాల ప్రక్రియ నిలిచిపోయిందని ప్రస్తావించారు. 2008లో జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి భూముల కేటాయింపునకు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌తో ఇళ్ల స్థలాల ప్రక్రియ నిలిచిపోయిందని వెల్లడించారు. 2022లో న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయని చెప్పారు. 2024 సెప్టెంబర్ 8వ తేదీన జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి భూమి అప్పగించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

జాతీయ పవర్‌లిఫ్టింగ్ విజేత కార్తీక్‌కు సన్మానం

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి: మండల నరసింహ రాములు



అక్షరశక్తి, వరంగల్, అక్టోబర్ 24: జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు పతకాలు సాధించిన వరంగల్ రంగశాయిపేటకు చెందిన నాగపురి కార్తీక్‌ను కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన పోటీల్లో కార్తీక్ రెండు బంగారు, రెండు రజత పతకాలు సాధించడం పట్ల సమితి ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కార్తీక్ స్వగృహానికి వెళ్లిన కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహ రాములు, కోలా రాము, బక్కి శ్రీధర్, కర్రె రాజ్‌కుమార్, దామర కొండ నిరంజన్ శాలువాలతో సత్కరించి, స్వీట్లు తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా మండల నరసింహ రాములు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్తీక్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్తీక్ తండ్రి నాగపురి శ్రీనాథ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మున్నూరు కాపు కులానికి సేవకుడిగా పనిచేస్తా



- కాపు సంఘం పటేల్స్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కొండ దేవయ్య
- సంఘం కుటుంబ సభ్యత్వ వెబ్‌సైట్ ఆవిష్కరణలో దేవయ్య పటేల్

అక్షరశక్తి,వరంగల్: మున్నూరు కాపు కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ.1,000 కోట్లు కేటాయించి, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధికి తోడ్పాటునందించాలని తెలంగాణ మున్నూరు కాపు పటేల్స్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ డిమాండ్ చేశారు. మున్నూరు కాపుల జనాభా, సభ్యుల వివరాలను కచ్చితంగా నమోదు చేసేందుకు రూపొందించిన కుటుంబ సభ్యత్వ వెబ్‌సైట్‌ను మహాత్మా గాంధీ కమ్యూనిటీ హాల్ శాంతినగర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవయ్య పటేల్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మున్నూరు కాపులంతా వెబ్‌సైట్ ద్వారా సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. సభ్యత్వ నమోదుతో సంఘం జనాభా, కుటుంబాల వివరాలను సమగ్రంగా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లోనూ మున్నూరు కాపులు వెనుకబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత తమకు న్యాయం జరుగుతుందని ఆశించినప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రయోజనం కలగలేదన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. మున్నూరు కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించినా తగిన నిధులు కేటాయించలేదని ఆరోపించారు. వెంటనే రూ.1,000 కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మున్నూరు కాపు సమాజానికి సేవకుడిగా పనిచేస్తూ, వారి హక్కులు, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

కాపులంతా ఐక్యంగా ముందుకు సాగి తమ హక్కులను సాధించుకోవాలని, ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు హక్కును వినియోగించుకుని తమ భవిష్యత్‌ను నిర్ణయించుకోవాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు

- కొండ దేవయ్య పటేల్
- ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు
- కటకం పెంటయ్య పటేల్
- ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షులు
- గైనని రాజన్ పటేల్
- వరంగల్ జిల్లా అధ్యక్షులు
- ముష్కమల సుధాకర్ పటేల్
- రాష్ట్ర కార్యదర్శి
- బండి రమేష్ పటేల్
- బండి చక్రపాణి పటేల్
- మేడిది మధుసూదన్ పటేల్
- వలిశెట్టి అనిల్ పటేల్
- బోరిగం భాస్కర్ పటేల్
- కంచి మనోహర్ పటేల్
- లక్కాకుల శ్యామ్ పటేల్
- పెరికారి శ్రీధర్ పటేల్
- మాడిశెట్టి వరుణ్ పటేల్
- దద్దనాల రమేష్ పటేల్
- కందుల శ్రీధర్ పటేల్
- తోట కృష్ణమూర్తి పటేల్
- ముష్కమల్ల దేవేందర్,
- వనం శ్యామ్,
- బండి సుధాకర్,
- దొరం ఆనంద్,
- గాదె నర్సింగం,
- పూజారి మోహన్,
- గాజే పవన్,
- శ్రీరాముల వీరన్న
- పోడిశెట్టి సతీష్,
- కోలా రాజేష్,పల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ చిత్రకారుడు నన్నూట రాజేశ్వర్ కు ప్రశంసలు

అక్షరశక్తి, ముంబై: జాతీయ చిత్రకారుడు నన్నూట రాజేశ్వర్ గీసిన చిత్రాలకు ముంబై మహానగరంలో ప్రశంసలు లభించాయి. ముంబైలోని ప్రభాదేవి ప్రాంతంలో ఉన్న పి.ఎల్. దేశ్‌పాండే మహారాష్ట్ర కళా అకాడమీలో నిర్వహిస్తున్న ఇండియా ఆర్ట్ మీట్ జాతీయ చిత్రకళా ప్రదర్శనలో ఆయన చిత్రాలను మూడు రోజుల పాటు ప్రదర్శనకు ఉంచారు. ఈ ప్రదర్శనను శుక్రవారం జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్ ఉపకులపతి ప్రొఫెసర్ హిం చటర్జీ, ప్రముఖ చిత్రకళా ప్రదర్శనల నిర్వాహకులు మనీష్ బాహతి, ఆర్కా ప్రధాన్ సందర్శించారు. ఈ సందర్భంగా నన్నూట రాజేశ్వర్ రూపొందించిన చిత్రాలను పరిశీలించి, వాటిని ప్రశంసిస్తూ అభినందనలు తెలియజేశారు.



ఈ విషయాన్ని చిత్రకారుడు నన్నూట రాజేశ్వర్ వెల్లడించారు.హన్మకొండ కు చెందిన రాజేశ్వర్ ఇప్పటికే పలు జాతీయ స్థాయి ఎగ్జిబిషన్ లలో పాల్గొని అనేక అవార్డులు సొంతం చేసుకున్నారు.







GUEST COLUMN

చీకటి నుంచి వెలుగువైపు.. డా.ఆజమ్ అలీ ప్రయాణం











మనిషి జీవితాన్ని నిర్ణయించేది అతడు పుట్టిన కుటుంబం కాదు, ఎదురైన కష్టాలను అధిగమించడానికి అతడు చూపే సంకల్పబలం. పేదరికం చదువుకు అడ్డుగోడగా నిలిచినా, అవమానం ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసినా, అవకాశాలు అందని దూరంలో ఉన్నా పట్టుదలతో ముందడుగు వేస్తే గమ్యాన్ని చేరుకోవచ్చని నిరూపించిన వ్యక్తి డాక్టర్ మొహమ్మద్ ఆజమ్ అలీ. ఒకప్పుడు కుటుంబాన్ని ఆదుకోవడానికి గోడలపై పోస్టర్లు అంటించిన బాలుడు, నేడు అధ్యాపకుడిగా వేలాది విద్యార్థులకు ఆంగ్ల భాషా నైపుణ్యాలను అందిస్తూ, నిరుపేద పిల్లల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. ఆయన ప్రస్థానం వ్యక్తిగత విజయగాథ మాత్రమే కాదు, విద్య సామాజిక మార్పుకు ఎంత శక్తిమంతమైన సాధనమో చాటిచెప్పే ఉదాహరణ.

1991 ఆగస్టు 5న ఉమ్మడి కరీంనగర్ జిల్లా చీర్ల వంచ గ్రామంలో జన్మించిన ఆజమ్ అలీ బాల్యం ఆర్థిక ఇబ్బందుల మధ్య సాగింది. తండ్రి లారీ డ్రైవర్‌గా పనిచేస్తే, తల్లి వ్యవసాయ కూలీగా కుటుంబాన్ని నడిపించేది. ఉపాధి కోసం కుటుంబం కరీంనగర్‌లోని పద్మనగర్‌కు వలస వచ్చింది. అయితే, ఏడో తరగతి చదువుతున్న సమయంలో తండ్రి కుటుంబానికి దూరమవడంతో పరిస్థితులు మరింత కఠినంగా మారాయి. కుటుంబ పోషణ భారం తల్లిపై పడింది. పేదరికం కారణంగా ఆజమ్ అలీ ఎనిమిదో తరగతిలో చదువు ఆపేసి బాల కార్మికుడిగా పనిచేయాల్సి వచ్చింది. గోడలపై పోస్టర్లు అంటించడం, పెళ్లిళ్లలో క్యాటరింగ్ పనులు చేయడం ద్వారా వచ్చిన కొద్దిపాటి ఆదాయం కుటుంబ అవసరాలకు తోడ్పడేది. అలాంటి కష్టకాలంలోనే ఆయన జీవిత దిశను మార్చిన ఒక సంఘటన చోటుచేసుకుంది. గోడలపై పోస్టర్లు అంటించే పనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సర్వ శిక్షా అభియాన్ ప్రచార నినాదమైన ‘అందరూ చదవాలి, అందరూ ఎదగాలి’ ఆయన కంటపడింది. ఇతరుల కోసం అంటిస్తున్న ఆ నినాదం ఆయనకే ఒక జీవిత పాఠమైంది. చదువు తనకు కూడా కొత్త ప్రపంచాన్ని తెరవగలదనే ఆలోచన కలిగింది. తిరిగి పాఠశాలలో చేరి చదువును కొనసాగించాలనే నిర్ణయానికి వచ్చారు. గురువుల ప్రోత్సాహం, తనలోని పట్టుదల ఆయనకు అండగా నిలిచాయి. ఒకప్పుడు చదువుకు దూరమైన బాలుడు, క్రమంగా ఉన్నత విద్యను అభ్యసించి పరిశోధకుడిగా ఎదిగాడు. అయితే, ఆయన ప్రయాణంలో ఆర్థిక సమస్యలతో పాటు భాషాపరమైన అవరోధాలు కూడా ఎదురయ్యాయి. డిగ్రీ చదువుతున్న సమయంలో జాతీయ సమైక్యతా శిబిరానికి ఆంధ్రప్రదేశ్ తరఫున ఎంపికైన ఆజమ్ అలీ, 2010లో కాకినాడలో జరిగిన శిబిరంలో తెలుగులో ప్రసంగించినందుకు నిరుత్సాహానికి గురయ్యారు. అక్కడ ఆంగ్లంలోనే మాట్లాడాలని చెప్పి ఆయన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపివేయడం తీవ్రంగా బాధించింది. ఆ అనుభవాన్ని ఓటమిగా స్వీకరించకుండా, ఆంగ్ల భాషపై పట్టు సాధించాలనే లక్ష్యంగా మలుచుకున్నారు. తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థికి ఆంగ్ల సాహిత్యాన్ని అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. ఆంగ్ల సాహిత్యం అభ్యసిస్తున్నప్పుడు ఎదురైన ఇబ్బందులతో ఒక దశలో చదువును వదిలిపెట్టి కరీంనగర్‌కు తిరిగి వచ్చారు. అయితే, ఆయన పాఠశాల ఉపాధ్యాయుడు సయ్యద్ మోయిన్ అహ్మద్ ఇచ్చిన ప్రోత్సాహం తిరిగి చదువుపై దృష్టి సారించేలా చేసింది. డాక్టర్ నలిమెల భాస్కర్, గందే పరశురాం రావు వంటి గురువుల సూచనలు కూడా తోడయ్యాయి. పుస్తకాలు, పత్రికలు విస్తృతంగా చదువుతూ భాషా నైపుణ్యాలను పెంపొందించుకున్నారు. పట్టుదలతో ఎం.ఎ., ఎం.ఎడ్. పూర్తి చేసి, ఆంగ్ల సాహిత్యంలో టోనీ మారిసన్ రచనలపై పరిశోధన చేసి పీహెచ్‌డీ సాధించారు.

ఈ అనుభవాలే ఆజమ్ అలీని సమర్థుడైన అధ్యాపకుడిగా తీర్చిదిద్దాయి. 2014లో ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో అతిథి అధ్యాపకుడిగా ప్రారంభమైన ఆయన ఉద్యోగ ప్రయాణం, పలు విద్యాసంస్థల్లో కొనసాగి ప్రస్తుతం వరంగల్‌లోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయికి చేరింది. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారిగా కూడా ఆయన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గత పన్నెండేళ్లుగా సుమారు 30 వేల మందికి పైగా విద్యార్థులకు ఆంగ్ల భాషా నైపుణ్యాలు నేర్పిన అనుభవం ఆయనకు ఉంది. తనకు ఒకప్పుడు కష్టంగా అనిపించిన భాషను ఇప్పుడు ఇతరుల భవిష్యత్తుకు ఉపయోగపడే సాధనంగా మార్చడం ఆయన జీవితంలోని విశేషమైన మలుపు. ఆజమ్ అలీ దృష్టిలో విద్య వ్యక్తిగత ఉద్యోగం సంపాదించడానికి మాత్రమే ఉపయోగపడే సాధనం కాదు; సమాజంలోని అసమానతలను తగ్గించే మార్గం కూడా. విద్యార్థి దశ నుంచే జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో చురుకుగా పాల్గొన్న ఆయన మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, నిరక్షరాస్యత నిర్మూలన, గ్రామీణ వైద్య శిబిరాలు వంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు సమాచారం అందించడం వంటి కార్యక్రమాల ద్వారా సామాజిక బాధ్యతను ఆచరణలో చూపారు. ఏడేళ్లపాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌గా సేవలందించి జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు.

సామాజిక సమస్యలపై అవగాహన ఆయనను ప్రజా ఉద్యమాల వైపు కూడా నడిపించింది. అవినీతి వ్యతిరేక ఉద్యమాలు, సుపరిపాలన కోసం చేపట్టిన కార్యక్రమాలు, సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో చైతన్యం కల్పించే ప్రయత్నాల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బండ్లు, రాస్తారోకోలు, సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్ వంటి కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకు మద్దతు తెలిపారు. విద్యారంగం, విశ్వవిద్యాలయాలకు సంబంధించిన సమస్యలను శ్రీకృష్ణ కమిటీ దృష్టికి తీసుకెళ్లడంలోనూ భాగస్వామ్యమయ్యారు. విద్యార్థిగా సమాజాన్ని అర్థం చేసుకున్న ఆయన, అధ్యాపకుడిగా మారిన తర్వాత కూడా ప్రజా సమస్యల పట్ల తన ఆసక్తిని కొనసాగించారు.

ఈ సేవా దృక్పథానికి సంస్థాగత రూపం ఇవ్వాలనే ఉద్దేశంతో 2023లో ‘చమక్ ఫౌండేషన్’ను స్థాపించారు. పేదరికం కారణంగా తాను చదువుకు దూరమైన అనుభవం ఉన్నందున, అలాంటి పరిస్థితుల్లో ఉన్న పిల్లలకు సహాయం చేయడం తన బాధ్యతగా భావించారు. ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలు, ప్రభుత్వ కళాశాలల్లో కెరీర్ మార్గదర్శకత్వం, వ్యక్తిత్వ వికాస శిక్షణ, పోటీ పరీక్షలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం అందితే వారి ప్రతిభకు కొత్త అవకాశాలు లభిస్తాయన్నది ఈ సంస్థ వెనుక ఉన్న ప్రధాన ఆలోచన.

రచయితగా కూడా ఆజమ్ అలీ తన ముద్ర వేశారు. ‘ఇండియన్ యూత్ లిటరేచర్: మ్యాపింగ్ యంగ్ మైండ్స్ ఇన్ చేంజింగ్ ఇండియా’ అనే ఆంగ్ల పుస్తకాన్ని రచించారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఎన్ఎస్ఎస్ సేవలకు, యువజన కార్యక్రమాలకు, అధ్యాపక వృత్తికి గుర్తింపుగా వివిధ పురస్కారాలు అందుకున్నారు. 2012లో ఇందిరా గాంధీ జాతీయ ఉత్తమ వాలంటీర్ అవార్డు, 2017లో జాతీయ ఉత్తమ యువజన అవార్డు, 2018లో మౌలానా ఆజాద్ జాతీయ అవార్డు, 2021లో ఆదర్శ అధ్యాపక అవార్డు, 2023లో మహాత్మా గాంధీ జాతీయ సద్భావన అవార్డు వాటిలో ముఖ్యమైనవి. ఆయన సేవలను పలువురు ప్రముఖులు ప్రశంసించారు.

ఆజమ్ అలీ జీవితాన్ని కేవలం అవార్డుల జాబితాతో కొలవలేం. పేదరికాన్ని ఎదుర్కొన్న వ్యక్తి ఉన్నత స్థాయికి చేరుకోవడం ఒక విజయమైతే, తనకు ఎదురైన కష్టాలు మరొకరికి ఎదురుకాకుండా ప్రయత్నించడం అంతకంటే గొప్ప విజయం. బాల కార్మికుడిగా గడిపిన రోజులు ఆయనను నిరాశలోకి నెట్టలేదు; చదువుకు దూరమైన అనుభవం ఇతర పిల్లల చదువుపై శ్రద్ధ చూపేలా చేసింది. భాషా అవమానం ఆయనను వెనక్కి తగ్గించలేదు; అదే భాషలో వేలాది మందికి శిక్షణ ఇచ్చే స్థాయికి చేర్చింది.

విద్యావకాశాలు అందరికీ సమానంగా అందని సమాజంలో ఆజమ్ అలీ వంటి వ్యక్తుల కృషికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పేద విద్యార్థులకు మార్గదర్శకత్వం, గ్రామీణ గ్రంథాలయాల విస్తరణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి లక్ష్యాలు ప్రభుత్వాలకే పరిమితం కాకుండా పౌర సమాజం కూడా బాధ్యతగా స్వీకరించాల్సిన అంశాలు. ‘అందరూ చదవాలి, అందరూ ఎదగాలి’ అనే నినాదాన్ని గోడపై చదివి తన జీవితానికి దిశానిర్దేశం చేసుకున్న ఆజమ్ అలీ, నేడు అదే ఆశయాన్ని ఇతరుల జీవితాల్లో ఆచరణలో పెడుతున్నారు. తన విజయాన్ని సమాజ పురోగతికి వంతెనగా మార్చుకున్న ఆయన ప్రయాణం యువతకు స్ఫూర్తి మాత్రమే కాదు, విద్య ద్వారా సమాజాన్ని మార్చవచ్చనే నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం.



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
9849328496
ramkishore.1504@gmail.com

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.